మైనార్టీ గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 28: జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌లో గల మైనార్టీ గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి అవుట్ సోర్సింగ్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారి జెమ్లానాయక్, ఆర్‌జేసీ సుధారాణి బుధవారం ప్రకటనలో తెలిపారు. మెదక్ గురుకులంలో పీజీటీ- బయోసైన్స్ (మహిళలకు), నర్సాపూర్ గురుకులంలో టీజీటీ- ఇంగ్లిష్, పీజీటీ - ఫిజికల్ సైన్స్, ఫిజికల్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నర్సాపూర్ మైనార్టీ బాలుర గురుకులంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అభ్యర్థులు బీఎడ్‌తో సంబంధిత పీజీ చేసి ఉండి మూడేండ్ల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే 9666724017 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

నేడు రామాయంపేటలో 2కే రన్

రామాయంపేట, ఆగస్టు 28: నేడు రామాయంపేటలో 2కే రన్‌ను సీఐ వెంకటరాజ గౌడ్ గురువారం ప్రారంభించనున్నట్లు దండు జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు దగిరి ప్రకటనలో తెలిపారు. దివంగత ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు మెదక్ చౌరస్తా వద్ద ప్రారంభిస్తారని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

నిజాంపేట, ఆగస్టు 28: మండలంలోని నందిగామ గుడ్ షెపర్డ్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ క్రైంపై ఎస్సై శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించారు.

ప్రత్యేక జీపీని ఏర్పాటు చేయాలి

రామాయంపేట, ఆగస్టు 28: ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోమటిపల్లి, కోమటిపల్లి తండా, ఒడ్డెర కాలనీ వాసులు ఎంపీడీవో షాజులుద్దీన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

బోనాలకు రూ.10 వేల విరాళం

శివ్వంపేట, ఆగస్టు 28: మండలంలోని పాం బండ గ్రామంలో జరిగే గరిగెళమ్మ జాతరకు శివ్వంపేట మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా రూ. 10 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: డీఆర్డీవో

నిజాంపేట, ఆగస్టు 28: ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాలు, దుకాణాలతో ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం చల్మెడ, నిజాంపేట గ్రామాల్లో పర్యటించి మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం వారి వ్యాపార సముదాయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీసీ స్వరూప తదితరులు ఉన్నారు.

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

చిన్నశంకరంపేట,ఆగస్టు 28: చిన్న శంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల్లో 14 ఏండ్లలోపు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను జిల్లా స్థాయి ఆటలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, మండల అధికారులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

పంట రుణమాఫీ వివరాల నమోదు

చిన్నశంకరంపేట, ఆగస్టు 28: రూ.2 లక్షల పంట రుణ మాఫీ వివరాలను చెన్నాయపల్లిలో బుధవారం మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్, ఏవో శ్రీనివాస్ నమోదు చేశారు. ఒక కుటుంబంలో ఎంత మందికి రుణమాఫీ అయ్యింది, ఇంకా ఎంత మందికి కావాల్సి ఉందో వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ రుణ మాఫీ వస్తుందని ఆయన తెలిపారు.

ధరణి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్

కలెక్టరేట్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై స్పెషల్ డ్రైవ్ (ఫైల్)

- జిల్లా వ్యాప్తంగా 2200 దరఖాస్తులు పెండింగ్
- నెలాఖరులోగా క్లియర్ చేయాలని ఆదేశం

ధరణిలో పెండింగ్ దరఖాస్తులు ఇలా..

పెండింగ్ మ్యుటేషన్ల కోసం	117
పీపీబీ కోర్టు కేసులు	42
విరాసత్ కోసం	100
టీఎం-33 పాస్‌బుక్ డాటా కరెక్షన్	375
పీవోబీ కోసం	492

మెదక్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. వివిధ రకాల మాడ్యూల్స్ కింద పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు జిల్లాలోని అన్ని మండలాల్లో 2,200 పెండింగ్‌లో ఉన్నాయి. పదిహేను రోజులుగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లు, సిబ్బంది ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రభుత్వ చొరవతో గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్, వారసత్వ బదిలీలు, భూసేకరణ సమస్యలు, ఖాతాల విలీనం, పెండింగ్ మ్యుటేషన్లు, కోర్టు కేసులు, పాస్ పుస్తకాలు లేకుండా నాలా మార్చడం వంటివి కొన్నింటిని అధికారులు పరిష్కరించారు. ప్రభుత్వం ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో దరఖాస్తులకు మోక్షం లభించనున్నది.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం..

జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తాం. ధరణి పెండింగ్ దరఖాస్తులపై అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతున్నది. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

- వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్

చకచకా శ్రీగురుపీఠం నిర్మాణ పనులు

శ్రీదత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, షిర్డీ సాయినాథ ఆలయాల ముమ్మర పనులు

గూడురులో ముమ్మరంగా జరుగుతున్న శ్రీగురుపీఠం నిర్మాణ పనులు

శివ్వంపేట, ఆగస్టు 28: మండలంలోని గూడురు శ్రీగురుపీఠంలో నిర్మించే దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, షిర్డీ సాయినాథ ఆలయాల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన శ్రీగురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దగొని శివకుమార్‌గౌడ్, బగలాముఖి శక్తిపీఠం ఉపాసకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గుంటూరు విశ్వగురు పీఠాధిపతులు విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దీనికి శిలాన్యాసం చేశారు. పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. పక్కనే బాలాలయం ఏర్పాటు చేసి అర్చకుడు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో నిత్యపూజలు, అర్చనలు చేస్తున్నారు.

శ్రీగురుపీఠం ప్రత్యేకతలు

శ్రీగురుపీఠంలో ప్రతిష్ఠించే విగ్రహాలు వియాత్నాం మార్బుల్‌తో జైపూర్‌లో తయారు చేయించారు. శ్రీదత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేదు. ఆరు ఫీట్ల పొడవుతో ఏకశిలతో ఆవు, శునకాలతో కలిసిన విగ్రహాన్ని తయారు చేయించారు.

ఆధ్యాత్మికత పెంపొందించడమే లక్ష్యం

స్థానికంగా ఆధ్యాత్మికత పెంపొందించడమే లక్ష్యం. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి, సనాతన ధర్మాన్ని కాపాడటానికి కృషి చేస్తున్నా. సొంత భూమి 18 గుంటల స్థలాన్ని శ్రీగురుపీఠం కోసం కేటాయించా. నాతో పాటు పలువురు దాతలు సహకరిస్తున్నారు.

- శివకుమార్‌గౌడ్, శ్రీగురుపీఠం వ్యవస్థాపకుడు

కార్తిక మాసంలో విగ్రహాల ప్రతిష్ఠ

పెద్దగొని శివకుమార్‌గౌడ్, ట్రస్టీ వెంకటేశ్వరశర్మ, ట్రస్టు సభ్యులు సూర్యంకుమార్‌గౌడ్, పబ్బ మహేశ్‌గుప్తా, నోముల హనుమంతు, రాజ్యం భిక్షపతి, మారెళ్ల మోహన్‌రావు పనులను పర్యవేక్షిస్తున్నారు. కార్తికమాసంలో విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

సూరజ్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

దుర్గాపతి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, ఆగస్టు 28: తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హవేళీఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ వరప్రసాద్ కుమారుడు సూరజ్ ఈ నెల 4న హైదరాబాద్‌లో జాతీయ స్థాయి కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో స్వర్ణ పతకం గెలిచారు. ఈ సందర్భంగా సూరజ్‌ను ఎస్పీ బుధవారం అభినందించారు. క్రీడల్లో రాణించే వారికి ఉన్నత విద్య అభ్యసించడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌడిపల్లి పోలీస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

కౌడిపల్లి, ఆగస్టు 28: కౌడిపల్లి పోలీస్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎప్పటికప్పుడు అక్కడి ప్రజలకు ప్రమాదాలు, దొంగతనాల నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏడుపాయల్లో ఏడాదికి ఇద్దరు, ముగ్గురు నీట మునిగి మృతి చెందుతున్నారన్నారు. ఆదివారం జాతీయ రహదారిపై వాహనాల తాకిడి ఎక్కువగా ఉన్నందున, దీనికి తోడు మద్యం తాగి అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో వాటిని గుర్తించి రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దుర్గాపతి కుటుంబానికి అండగా ఉంటాం

మెదక్ అర్బన్, ఆగస్టు 28: మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ దుర్గాపతి కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని తోటి సిబ్బంది అంతా కలిసి ఇచ్చిన రూ.80 వేలను బాధిత కుటుంబానికి ఎస్పీ అందజేశారు. దుర్గాపతికి శాఖాపరంగా రావాల్సిన అన్ని బెనిఫిట్స్ అందజేస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు శిక్షణా కేంద్రాలు

కోనాపూర్ గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఈడీ విజయలక్ష్మి

రామాయంపేట, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ మహిళల కోసం కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, న్యాక్ డైరెక్టర్ రాము తెలిపారు. ఇందుకోసం స్థలాలను ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోనాపూర్, డీ.ధర్మారం గ్రామాల్లోని స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ మండలంలోని రెండు గ్రామాల్లో న్యాక్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో కేంద్రంలో 30 మంది ఎస్సీ మహిళలకు కుట్టు శిక్షణ ఇవనున్నట్లు తెలిపారు. అనంతరం కుట్టు మిషన్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. మూడు నెలల పాటు ఎస్సీ కార్పొరేషన్ కింద శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు రామాయంపేటలోని న్యాక్ సెంటర్‌లో తమ దరఖాస్తును అందజేయాలన్నారు. వారితో రామాయంపేట న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ నార్సింపేట భిక్షపతి, కరికె విద్యాసాగర్, మాసాయిపేట మల్లేశం తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో కోటి పుష్పార్చన

చిన్నశంకరంపేటలో స్వామివారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రామాయంపేట, ఆగస్టు 28: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గోదాసమేతా పద్మావతి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలకు కోటి పుష్పార్చనను బుధవారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మూలవిరాట్‌లను పూలతో అలంకరించి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించారు.

వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు

చిన్నశంకరంపేట, ఆగస్టు 28: మండలంలోని గజగట్లపల్లిలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి తరువాతి రెండో రోజు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ అని పంతులు భీష్మాచారి తెలిపారు.

ప్రత్యేక యాప్‌లో కుటుంబ సభ్యుల నిర్ధారణ

- జిల్లా వ్యాప్తంగా 10014 మందికి రుణమాఫీ రాలేదు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు

ప్రత్యేక యాప్‌ను వివరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు

రామాయంపేట, ఆగస్టు 28: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, ప్రత్యేక యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన పట్టణంలోని రుణమాఫీ రాని వారి ఇంటికి వెళ్లి మొబైల్ ఫోన్‌తో వారిని గుర్తించి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పంట రుణమాఫీ రాని రైతులు 10,014 మంది ఉన్నారని, వారందరికీ త్వరలోనే మొబైల్ ప్రత్యేక యాప్ ద్వారా రుణమాఫీ అందిస్తామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిందని మొబైల్ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ప్రతి రైతుకూ రుణమాఫీ అందించేందుకు కృసి చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలోని గ్రామ గ్రామాన అధికారులు తిరిగి రైతులకు న్యాయం చేస్తారన్నారు. రైతులు తమ దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్సును సంబంధిత వ్యవసాయ కార్యాలయాల్లో అందజేసి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆయనతో రామాయంపేట ఏవో రాజ్‌నారాయణ ఉన్నారు.

కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం

నిజాంపేట, ఆగస్టు 28: మండలంలోని బచ్చురాజ్‌పల్లిలో రుణమాఫీలో భాగంగా 'కుటుంబ సభ్యుల నిర్ధారణ' కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ మాట్లాడుతూ మండలంలో 272 కుటుంబ సభ్యులు నిర్ధారణ చేయాల్సిన జాబితా తమకు వచ్చిందని, వారి నుంచి సేకరించిన వివరాలను కుటుంబ సభ్యుల నిర్ధారణ యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఏవో సోమలింగా రెడ్డి, విస్తరణ అధికారులు శ్రీలత, కావేరి, రైతులు ఉన్నారు.

బచ్చురాజ్‌పల్లిలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఏవో గోవింద్

నర్సాపూర్ డిపోలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

బస్‌డిపో ఉన్నా తప్పని ప్రయాణ తిప్పలు

నర్సాపూర్, ఆగస్టు 28: నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసినా ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో సమయానికి రాక నానా అవస్థలు పడుతున్నారు. స్థానిక బస్టాప్‌లో గంటల తరబడి నిరీక్షించి ప్రయాణికులు విసిగెత్తి పోతున్నారు. నర్సాపూర్ నుంచి గజ్వేల్, సంగారెడ్డి వెళ్లే మార్గంలో ఉదయం బస్సులు సమయానికి రావడంలేదు. ఎప్పుడో ఒక సారి వచ్చిన బస్సులో ఎక్కడానికి యుద్ధం చేయాల్సి వస్తున్నది. నర్సాపూర్ డిపో నుంచి సంగారెడ్డి, గజ్వేల్ మార్గాలకు ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, ఆగస్టు 28: సెప్టెంబర్ 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా న్యాయవాదులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ.లక్ష్మీశారద అన్నారు. బుధవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయవాదులు, బ్యాంకు, ఇన్సూరెన్స్ స్టాడింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు వినియోగించుకుని అధికంగా కేసులు రాజీకుదుర్చుకునేలా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి

వెల్దుర్తి, ఆగస్టు 28: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐబీ గెస్ట్‌హౌస్ వద్ద బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పెద్ది మనోహర్ (25) యూనికార్న్ వాహనంపై వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌కు వెళ్లాడు. ఎక్సెల్ వాహనంపై వెల్దుర్తి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదే రోడ్డులో వెళ్తున్నాడు. అతి వేగంగా ఉన్న మనోహర్, ఎక్సెల్ వాహనంపై ఉన్న వ్యక్తికి బలంగా ఢీకొట్టాడు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిన మనోహర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్సెల్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స కోసం స్థానిక దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వెల్దుర్తి పోలీసులు పంచనామా చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బీమా చెక్కులు అందజేత

బీమా చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఆగస్టు 28: నర్సాపూర్‌లోని రామ్‌రహీం అనే స్త్రీనిధి సంఘం గ్రూపునకు చెందిన మౌనిక మృతి చెందడంతో మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును బుధవారం కుటుంబసభ్యులకు మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ అందజేశారు. నంది గ్రూపులో భాగ్య లక్ష్మి మృతి చెందడంతో రూ.30 వేల బీమా చెక్కు అందజేశారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆలయానికి భూమిపూజ చేస్తున్న దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి

నిజాంపేట, ఆగస్టు 28: నిజాంపేటలో నిర్మించనున్న పెండ్లి పోచమ్మ ఆలయానికి దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. పురోహితుడు లక్ష్మణశాస్త్రి, దుర్గామాత ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌గౌడ్, కోశాధికారి మహేశ్, గ్రామస్తులు మహేందర్, నరేందర్, మారుతి, స్వామి, తిరుపతి, వినయ్‌గౌడ్, వెంకటస్వామి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట, ఆగస్టు 28: మండలంలోని చండి గ్రామానికి చెందిన ఉప్పరి బాలయ్య, శివన్నగారి గోపాల్ కుటుంబాలను మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా బుధవారం పరామర్శించి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. పోతులబొగుడలో కొలిచెల్మ నర్సింలు, లక్ష్మి దంపతుల కుమార్తె వివాహానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఈత రాక ఇద్దరు యువకులు మృతి

రాము(ఫైల్)

నవీన్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 28: క్వారీ నీటి గుంతలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు ఈత రాక నీట మునిగి మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసాయిపేట గ్రామంలో బుధవారం జరిగింది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డప్పు నవీన్(22), నెల్లూర్ రాము(26) మంగళవారం గ్రామ శివారులోని క్వారీ నీటి గుంతలో స్నానానికి వెళ్లారు. ఈత రాకపోవడంతో నీటితో మునిగి మృతిచెందారు. బుధవారం ఉదయం మృతదేహాలు తేలడంతో ఘటనా స్థలానికి చెరుకున్న చేగుంట ఎస్సై వాటిని బయటకు తీసి, శవ పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.